**ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం**

**ప్రాంతీయ వార్తా విభాగం**

**ప్రాంతీయ వార్తలు**

**తేది:07.03.2026** **సమయం : 13.10 గంటలు**

**ముఖ్యాంశాలు**

1. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో అమెరికాలోని డెలావర్ రాష్ట్ర గవర్నర్ మాట్ మేయర్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. విద్య, ఆరోగ్య రంగాల్లో తీసుకురావాల్సిన సంస్కరణలపై ఇరువురు చర్చించారు
2. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఇవాళ అంబర్‌పేట్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. అంబర్‌పేట్ ఫ్లైఓవర్ కింది సర్వీసు రోడ్డు పనులను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు
3. అర్హత గల మహిళలకు ఏప్రిల్ నెలలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రకటించారు.
4. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్ 2025 (TGFA) విజేతల జాబితాను జ్యూరీ సభ్యులు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు అందజేశారు. 'ఎన్టీఆర్ నేషనల్ ఫిల్మ్ అవార్డు'కు చిరంజీవి, 'పైడి జైరాజ్ ఫిల్మ్ అవార్డు'కు కమల్ హాసన్, 'అక్కినేని నాగేశ్వరరావు ఫిల్మ్ అవార్డు'కు జయసుధ ఎంపికయ్యారు.

…………………………………………………………

**రేవంత్ రెడ్డి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో అమెరికాలోని డెలావర్ రాష్ట్ర గవర్నర్ మాట్ మేయర్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు, డెలావర్ ఫస్ట్ లేడీ లారెన్ మేయర్, ఇరుపక్షాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ముఖ్యంగా విద్య, ఆరోగ్య

రంగాల్లో తీసుకురావాల్సిన సంస్కరణలపై ఉభయ నేతలు సుదీర్ఘంగా చర్చించారు. డెలావర్ రాష్ట్రంలో పేద, మధ్యతరగతి ప్రజల కోసం అమలు చేస్తున్న గృహ నిర్మాణ పథకాలు, రుణమాఫీ వంటి అంశాలను గవర్నర్ ముఖ్యమంత్రికి వివరించారు. వీటితో పాటు డేటా ప్రివెన్షన్, యూనివర్సల్ హెల్త్ కేర్ వంటి కీలక అంశాలపై కూడా చర్చలు జరిగాయి. భవిష్యత్తులో తెలంగాణ, డెలావర్ రాష్ట్రాల మధ్య బలమైన సత్సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించిన మాట్ మేయర్, అధికారిక ప్రతినిధుల బృందంతో కలిసి తమ రాష్ట్ర పర్యటనకు రావాల్సిందిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని సాదరంగా ఆహ్వానించారు.

...........డెస్క్

**స్టాండ్ విత్ హర్'**

హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో నిర్వహించిన 'స్టాండ్ విత్ హర్' కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, మహిళల రక్షణ కోసం కేవలం చట్టాలు చేస్తే సరిపోదని, వాటిని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేసినప్పుడే ప్రభుత్వ బాధ్యత నెరవేరుతుందని అన్నారు. మహిళలను పారిశ్రామికవేత్తలుగా మార్చేందుకు హైటెక్ సిటీ పక్కనే 'ఇందిరా మహిళా స్టాల్స్' కేటాయించామని, వారి ఉత్పత్తులను అమెజాన్ ద్వారా విక్రయించేలా ఒప్పందం చేసుకున్నామని రేవంత్ రెడ్డి వివరించారు. ప్రతి సంక్షేమ పథకాన్ని మహిళల పేరుతోనే అందిస్తున్నామని పేర్కొన్న సీఎం, మహిళా సంఘాల ద్వారా ఆర్టీసీలో 1000 బస్సులను నడిపిస్తూ వారిని వ్యాపార భాగస్వాములుగా మార్చామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధిలో మహిళల పాత్ర అత్యంత కీలకమని ఈ సందర్భంగా సీఎం పునరుద్ఘాటించారు.

.....డెస్క్

..........బైట్ ...........

**కిషన్ రెడ్డి**

కేంద్రమంత్రి కిషన్ రెడ్డి ఇవాళ అంబర్‌పేట్ నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి అంబర్‌పేట్ డివిజన్‌లోని నాగేంద్ర నగర్ బస్తీని సందర్శించి, స్థానిక ప్రజల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం అంబర్‌పేట్ పోలీస్ బాయ్స్ హై స్కూల్‌ను సందర్శించిన కిషన్ రెడ్డి, అక్కడి విద్యా సౌకర్యాలను, పాఠశాల పరిస్థితులను పరిశీలించారు. ఇక నియోజకవర్గంలో అత్యంత కీలకమైన అంబర్‌పేట్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులను ఆయన క్షేత్రస్థాయిలో తనిఖీ చేశారు.

.......... డెస్క్

**భద్రాచలం**

భద్రాచల శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జరగనున్న శ్రీరామనవమి కల్యాణోత్సవ వేడుకలకు సంబంధించి సెక్టార్ టిక్కెట్లు నేటి నుండి ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చాయి. ఈ నెల 27న జరిగే తిరుకళ్యాణ మహోత్సవం, 28న జరిగే పట్టాభిషేక మహోత్సవాలను తిలకించాలనుకునే భక్తులు దేవస్థాన అధికారిక వెబ్‌సైట్ ద్వారా తమ టిక్కెట్లను ముందస్తుగా బుక్ చేసుకోవచ్చు. ఆన్‌లైన్‌లో టిక్కెట్లు పొందిన భక్తులు ఈ నెల 20 నుంచి 27వ తేదీ ఉదయం 6 గంటల లోపు తానీషా కళ్యాణ మండపంలోని సి.ఆర్.ఓ కార్యాలయంలో తమ అసలు గుర్తింపు కార్డును చూపి ఒరిజినల్ టిక్కెట్లను పొందాలని ఆలయ ఈవో దామోదర్ రావు సూచించారు.

........పిటిసి, భద్రాచలం

**జనగాం జిల్లా - ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక**

జనగామ జిల్లాలో పారిశుద్ధ్య నిర్వహణ పక్కాగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అధికారులను ఆదేశించారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళికలో భాగంగా చేపట్టిన 99 రోజుల కార్యాచరణ కార్యక్రమంలో భాగంగా, నెల్లుట్ల గ్రామ పంచాయతీ పరిధిలోని చెరువు వద్ద రోడ్డుకు ఇరువైపులా జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఆయన స్వయంగా పరిశీలించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రోడ్ల పక్కన ఉన్న పిచ్చి మొక్కలు, ప్లాస్టిక్ వ్యర్థాలు, పేరుకుపోయిన చెత్తను తక్షణమే తొలగించాలని సూచించారు. ముఖ్యంగా రోడ్ల పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా పారిశుద్ధ్య ప్రక్రియను నిరంతరం కొనసాగించాలని ఆయన అధికారులకు స్పష్టం చేశారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుతో పాటు మున్సిపల్ సిబ్బంది, ఇతర స్థానిక అధికారులు పాల్గొన్నారు.

.........పిటిసి, జనగాం

**ఆసిఫాబాద్**

ఆసిఫాబాద్ జిల్లాలో ఈ నెల 14 నుండి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఇన్చార్జి విద్యాధికారి, అదనపు కలెక్టర్ డేవిడ్ స్పష్టం చేశారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 6వేల 949 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతున్నారని, వారి కోసం 38 పరీక్ష కేంద్రాలను సిద్ధం చేసినట్లు ఆయన వెల్లడించారు. పరీక్షల పర్యవేక్షణ కోసం 76 మంది చీఫ్ సూపరింటెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులతో పాటు 500 మంది ఇన్విజిలేటర్లను నియమించామని ఆయన తెలిపారు. ఇప్పటికే జిల్లా కేంద్రానికి పరీక్షా పత్రాలు చేరుకున్నాయని, విద్యార్థులు లేదా తల్లిదండ్రులు తమ సందేహాల నివృత్తి కోసం జిల్లా స్థాయి హెల్ప్ లైన్ నంబర్ 9908556117 ను సంప్రదించవచ్చని ఆయన సూచించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్షలు పారదర్శకంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారని డేవిడ్ వివరించారు.

......పిటిసి, ఆసిఫాబాద్

**ఇందిరమ్మ ఇండ్లు**

అర్హత గల మహిళలకు ఏప్రిల్ నెలలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి ప్రకటించారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు నియోజకవర్గంలో పర్యటించిన ఆయన, డీఎంఎఫ్, సీఎస్ఆర్ నిధులతో చెన్నూరు

మున్సిపాలిటీని మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. పట్టణంలో తుదిదశలో ఉన్న 100 పడకల ప్రభుత్వ ఆసుపత్రిని త్వరలోనే ప్రారంభిస్తామని, అలాగే మైనారిటీ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి 50 లక్షలు కేటాయించి శంకుస్థాపన చేస్తున్నామని తెలిపారు. ప్రజల సమస్యలను వేగంగా పరిష్కరించడమే 99 రోజుల యాక్షన్ ప్లాన్ ప్రధాన ఉద్దేశమని, అధికారులు ప్రజలతో మమేకమై పనిచేయాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుమార్ దీపక్‌తో కలిసి ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక ప్రతిజ్ఞ చేయించిన మంత్రి, మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డు అభివృద్ధికి 15 లక్షల రూపాయల చొప్పున నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

.....పిటిసి, మంచిర్యాల

**గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డ్స్–2025 విజేతల జాబితా విడుదలైంది. నిర్మాత, TFDC చైర్మన్ దిల్ రాజు నేడు వివరాలను వెల్లడించారు.ఈ ఏడాది ఉత్తమ చిత్రంగా రాజు వెడ్స్ రాంబాయి ఎంపికవగా, రెండో స్థానంలో దండోరా నిలిచింది. ఇక నటన విభాగంలో తండేల్ చిత్రానికి గానూ నాగచైతన్య ఉత్తమ నటుడిగా, ది గర్ల్ ఫ్రెండ్ చిత్రానికి గానూ రష్మిక మందన్న ఉత్తమ నటిగా అవార్డులను కైవసం చేసుకున్నారు. ప్రముఖ దిగ్గజాలకు ఇచ్చే ప్రత్యేక అవార్డులలో మెగాస్టార్ చిరంజీవికి ఎన్టీఆర్ నేషనల్ అవార్డు, విశ్వనటుడు కమలహాసన్‌కు పైడి జయరాజ్ అవార్డు ప్రకటించారు. అలాగే జయసుధ, ఆర్. నారాయణ మూర్తి వంటి సీనియర్ నటులకు కూడా విశిష్ట పురస్కారాలు దక్కాయి.2025లో సెన్సార్ పూర్తి చేసుకున్న చిత్రాల నుండి అత్యుత్తమ ప్రతిభను ఎంపిక చేసినట్లు కమిటీ తెలిపింది. ఈ అవార్డుల ప్రదానోత్సవం ఉగాది పర్వదినం సందర్భంగా మార్చి 19న జరగనుంది.

..........పిటిసి, హైదరాబాద్

**మై భారత్ కేంద్రం**

కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని 'మై భారత్ కేంద్రం' రేపు సికింద్రాబాద్‌లోని జింఖానా గ్రౌండ్స్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను నిర్వహిస్తోంది. అస్మిత (ASMITA) కార్యక్రమంలో భాగంగా ఉదయం 7 నుండి 10 గంటల వరకు జరిగే ఈ వేడుకల్లో అంతర్జాతీయ అథ్లెట్ సౌందర్య, రోయింగ్ ప్లేయర్ గీతాంజలి ముఖ్య అతిథులుగా పాల్గొంటారు. ఈ సందర్భంగా మహిళలకు 100, 200, 400 మీటర్ల పరుగు పందాలతో పాటు డాడ్జ్ బాల్, మ్యూజికల్ చైర్ వంటి వినోదాత్మక క్రీడలను నిర్వహించి విజేతలకు పతకాలు అందజేస్తారు. దేశవ్యాప్తంగా 250 ప్రాంతాల్లో జరుగుతున్న ఈ విశిష్ట చొరవ ద్వారా క్రీడల్లో మహిళా శక్తిని చాటడమే తమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

......పిఐబి, హైదరాబాద్

**నేషనల్ హెల్త్ అథారిటీ**

నేషనల్ హెల్త్ అథారిటీ (NHA) ఆధ్వర్యంలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ పరిధిలో నిర్వహిస్తున్న రెండు రోజుల NHCX హ్యాకథాన్ సదస్సు ఈరోజు ఐఐటీ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. ఈ సందర్భంగా బీమా రంగ ప్రతినిధి దీపక్ సూద్ మాట్లాడుతూ, పాలసీదారులకు, బీమా సంస్థలకు మధ్య పారదర్శకమైన సేవలు అందించడానికి సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం అత్యవసరమని అభిప్రాయపడ్డారు. ఆరోగ్య బీమా రంగంలో సంస్థల గుర్తింపు అనేది వారు అందించే మెరుగైన సేవలపైనే ఆధారపడి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. ఓపీ సేవల నుండి ఫార్మా, ల్యాబ్ సేవల వరకు ప్రతి దశలోనూ బిల్లింగ్ విధానం అత్యంత పారదర్శకంగా ఉండాలని, ఇందుకోసం వినూత్న డేటా విధానాలు రావాలని ఆయన కోరారు. ఆరోగ్య బీమా సేవలు, ఆసుపత్రుల పనితీరు మరింత వేగవంతం కావాలని ఈ సదస్సు ఆకాంక్షించింది. ఈ కార్యక్రమంలో ఐఐటీ డీన్ నరహరి శాస్త్రి, కిరణ్ గోపాల్, జనరల్ ఇన్సూరెన్స్ సీఈవో ప్రకాష్, పలువురు పరిశోధకులు పాల్గొని తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

.....పిటిసి, సంగారెడ్డి

**విశ్వకర్మ పథకం**

ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం చేతివృత్తుల కళాకారులకు తమ వ్యాపారాలను వృద్ధి చేసుకునేందుకు ఒక అద్భుతమైన అవకాశమని నల్గొండ జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ పేర్కొన్నారు. నల్గొండలో ఏర్పాటు చేసిన మూడు రోజుల వాణిజ్య ప్రదర్శనను కలెక్టర్ ప్రారంభించి, లబ్ధిదారుల స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రభుత్వం మొదటి విడతగా లక్ష రూపాయల రుణం మంజూరు చేస్తుందని.. దీనిని 18 నెలల్లో తిరిగి చెల్లిస్తే, రెండో విడతగా రెండు లక్షల రూపాయల రుణం లభిస్తుందని వివరించారు. జిల్లాలో సుమారు 3వేల 580 మంది లబ్ధిదారులు దరఖాస్తు చేసుకున్నారని, వీరందరికీ శిక్షణ ఇచ్చి నైపుణ్యాలను అభివృద్ధి చేస్తామని ఆయన తెలిపారు. తక్కువ వడ్డీకే రుణాలు అందుతున్నందున, కళాకారులు కష్టపడి ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ కోరారు

........పిటిసి, నల్గొండ

**వాతావరణం**

తెలంగాణలో రాబోయే మూడు రోజుల్లో పొడి వాతావరణం నెలకొనే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 2 నుండి 3 డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉంది. ఎండల తీవ్రత పెరిగే సూచనలు ఉన్నందున ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

..........డెస్క్